www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 14 అక్టోబరు 2024
5
చిత్తూరు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక మార్పు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఈ నెల 14 వతేది సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని అనివార్య కారణాల వల్ల ఈ నెల 15 వ తేదీ మంగళవారానికి మార్పు చేశారని, సమస్యల పరిష్కారం నిమిత్తం జిల్లా కేంద్రానికి వచ్చే అర్జీదారులు ఈ మార్పును గమనించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పోలీస్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ..

చిత్తూరు అర్బన్: సోమవారం నిర్వహించాల్సిన 'ప్రజా సమస్యల ఫిర్యాదుల కార్యక్రమం' కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ మంగళవారానికి మార్చినట్లు జిల్లా ఎస్పి మనికంఠ చందోలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి, తమ సమస్యలను తెలపడానికి మంగళవారం ఉదయం 10.30 గంటలకు చిత్తూరు పోలీస్ కార్యాలయానికి రావాలని ఎస్పీ కోరారు.

పం(దం)డగ సంబరం

• కుళ్లిన టమోటా..నాణ్యతలేమి.. • రైతు బజారులో సబ్సిడీ సరుకుల విక్రయాలు • కొనుగోళ్లు లేక వెలవెల

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: 'పండగ చేస్కో..' అంటూ ప్రభుత్వం దసరాకు పేదలకు రైతు బజార్ల ద్వారా విక్రయిస్తున్న సబ్సిడీ సరుకులు నాణ్యత లేకపోవడంతో కొనుగోలు చేసేందుకు ప్రజలు ఎవరూ ముందుకు రాక ప్రభుత్వం ప్రకటించిన సబ్సిడీ సరుకుల విక్రయం ప్రకటన దండగ మారి పండుగ సంబరాలు కరువయ్యాయి.

'పండగ చేస్కో..' అంటూ రాష్ట్ర ప్రభుత్వం ఉల్లి, టమోటా, పామాయిల్, సన్‌ఫ్లవర్ అయిల్, సన్న బియ్యం సబ్సిడీతో అందిస్తున్నట్లు ప్రకటించింది. 'పండుగ చేస్కో..' అంటూ ఒక్క రేషన్ కార్డుపై పామోలిన్ లీటర్ రూ. 110, సన్‌ఫ్లవర్ అయిల్ మూడు లీటర్లు, 910 గ్రాములు రూ. 124 ఒక్క ప్యాకెట్ సబ్సిడీ అంటూ ప్రకటించింది. టమోటా సగటు కేజి రూ. 40, ఉల్లి కేజీ రూ. 39 అందించ నున్నట్లు ప్రకటించింది. స్థానిక మార్కెట్ కంటే రూ. రూ.15 నుంచి 12 తగ్గించి వినియోగ దార్లకు పండుగ చేసుకోండంటూ దసరా బంఫర్ ఆఫర్ ప్రకటిం చింది.

కొనుగోలుదార్లు లేక బోసిపోయిన సబ్సిడీ నిత్యావసరాల విక్రయకేంద్రం

ఖాళీ సంచి, రేషన్‌కార్డు తీసుకొని స్థానిక రైతుబజార్‌కు వెళ్లిన వారికి కుళ్లిన టమోటాలు, ఉల్లిగడ్డలు స్థానిక మార్కెట్ ధరలతోనే కందిపప్పు, ఇతర పప్పు దినుసులు, నూనె ప్యాకెట్లు దర్శనం ఇవ్వడంతో 'ఇదేమిచోద్యం?' అంటూ ప్రజలు అయోమయంతో ఖాళీ సంచులతోనే వెనుదిగాల్సి వచ్చింది. స్థానిక మార్కెట్‌తో పోల్చితే పెద్దగా తేడా లేక పోవడంతో బహిరంగ మార్కెట్‌లోనే కొనుగోలు చేయడం మంచిదని వినియోగదార్లు భావిస్తున్నారు. కిలో కందిపప్పు బహిరంగ మార్కెట్‌లో రూ. 150 నుంచి 160, సన్న బియ్యం బస్తా రూ. 1,300 నుంచి 1,400లుగా వుంది. రైతు బజార్‌లో కిలో కందిపప్పు రూ. 150, సన్న బియ్యం 25 కేజీల బస్తా రూ. 1,300 క్వాలిటీపై గ్యారెంటీ లేదు. బియ్యం నాణ్యత లేకుంటే వెనక్కి తీసుకోరు. బహిరంగ మార్కెట్‌లో అయితే బియ్యం నాణ్యత లోపిస్తే తిరిగి ఇచ్చేసే అవకాశముంది. ప్రభుత్వం, ప్రభుత్వ అదికారులు సబ్సిడీ.. సబ్సిడీ అంటూ రైతుబజార్‌లో చేపట్టిన అమ్మకాలు వట్టి బూటకమేనని తెలిపోయింది. నాసిరకం టమోటాలు, ఉల్లి కొనుగోలు చేసేందుకు వినియోగదార్లు ముందుకు రాకపోవడంతో చిత్తూరు రైతుబజార్‌లో ఏర్పాటు చేసిన సబ్సిడీ వస్తువులు కొను గోలు కేంద్రం శనివారం కొనుగో

విక్రయ కేంద్రం పక్కనే కుళ్లి కంపుకొడుతున్న సబ్సిడీ టమోటా

రైతు బజార్‌లో విక్రయిస్తున్న నాసిరకం టమోటా

లుదార్లు లేక లేకబోసిపోయి కనిపించింది. దసగా కావడంతో కొనుగోలుదార్లు ప్రశ్నలకు సమాధానం చెప్పే అధికారులు కరువయ్యారు.

నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయి. ప్రజలు దసరా చేసుకొనేలా సబ్సిడీతో అందిస్తామని ప్రభుత్వం రైతు బజార్లలో చేపట్టిన విక్రయాలు నాసిరకంగా మారాయి. బహిరంగ మార్కెట్ కంటే పెద్దగా తేడా లేకపోయింది. బహిరంగ మార్కెట్‌లోనే టమోటా కిలో రూ. 30 నుంచి 35, ఉల్లి కిలో రూ. 40 నుంచి 45కు అమ్ముతున్నారు. సబ్సిడీ పేరుతో నాసిరకం టమోటాలు తీసుకురావడంతో ఒక్క రోజుకే వందల కిలోలు కుల్లిపోవడంతో రైతుబజార్ సబ్సిడీ నిత్యావసరాల విక్రయ కేంద్రం వద్ద కుల్లికంపుకొడుతూ టమోటాలు కనిపించాయి. ప్రభుత్వ సబ్సిడీ పేరుతో విక్రయించే కూరగాయాలు, నిత్యసరాలు నాణ్యత చూసుకొని విక్రయించాలని కోనుగోలుదార్లు కోరుతున్నారు.

నేటి నుండి భారీ వర్షాలు..

అప్రమత్తంగా వుండాలి

జిల్లా అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : వాతావరణ శాఖ హెచ్చరికలు నేపథ్యంలో ఈ నెల 14 వ తేదీ నుండి 16వ తేదీ వరకు రాయలసీమ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు వున్నాయని విపత్తుల నిర్వహణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో అధికారు లందరూ అప్రమత్తంగా వుండా లని ప్రాణ, పశు, ఆస్తి నష్టం జరగకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని టెలీకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సుమిత్ కుమార్ జిల్లా అధికారులను, ఆర్‌డిఓలు, తహశీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులను ఆదేశించారు. చిత్తూరు జిల్లాలో ఈనెల 14వ తేదీ నుండి 16వ వరకు భారీ వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో జిల్లాలోని జిల్లా అధికారుల నుండి మండల స్థాయి అధికారుల వరకు అందరూ అప్రమత్తం గా ఉండాలని అధికారు లందరూ వారి వారి ప్రధాన కార్యాలయంలో అందు బాటులో ఉండాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రధానంగా ప్రాణ నష్టం, పశు నష్టం, ఆస్తి నష్టం జరగ కుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టా లని మండల స్థాయిలోని అధికారులు అందరూ సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను, శిథిలావస్థలో ఉన్న భవనాలలో ఉన్నవారు, పూరి గుడిసెల్లో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించా లన్నారు. సచివా లయ సిబ్బంది వారి పరిధిలో అప్రమత్తం గా ఉంటూ ఎలాంటి ప్రమాదాలు జరిగినా వెంటనే ఉన్నతా ధికారులకు సమాచారం అందించేలా భాధ్యతగా ఉండాలని ఆదేశించారు. చెరువులు, వాగులు, వంకలు వద్ద అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను, భారీ వర్షాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా మందస్తు చర్యలు చేపట్టాలని సిబ్బంది అందుబాటులో ఉండాలని ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. జిల్లాలో ఎలాంటి నష్టం లేకుండా చూడాలని, అన్ని శాఖలు సమర్థవంతం గా బాధ్యతతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

భువనేశ్వరి పర్యటన వాయిదా

ప్రజాశక్తి- కుప్పం టౌన్ :

ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ నారా భువనేశ్వరి కుప్పం పర్యటన వాయిదా వేస్తున్నట్లు టిడిపి వర్గాలు తెలిపాయి. ఈ నెల 14వ తేదీ నుండి నాలుగు రోజులపాటు నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలలో పర్యటించవలసిన భువనేశ్వరి వాతావరణ మార్పుల కారణంగా వాయిదా వేసుకున్నారని తెలిపారు. బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా చిత్తూరు జిల్లా పరిధిలో ఈ నెల 14, 15, 16 తేదీలలో వర్షాలు కురిసే అవకాశం వుందని వాతావరణ శాఖ ప్రకటించింది. ఈ నేపథ్యంలో భువనేశ్వరి కుప్పం పర్యటన రద్దు అయ్యిందని టిడిపి వర్గాలు తెలిపాయి.

ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు డిఎస్‌సి ఉచిత శిక్షణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సాంఘిక సంక్షేమ శాఖ ఉత్తర్వుల మేరకు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ ద్వారా ఎస్‌జిటి, స్కూలు అసిస్టెంట్ పోస్టుల నిమిత్తం ఉచిత బోధన, ఉచిత భోజన, వసతి సౌకర్యాలతో మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ అధికారి నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థుల వార్షిక ఆదాయం రూ.2లక్షల50 వేల లోపు ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈనెల 11 నుండి 21వ తేదీ లోపు జ్ఞానభూమి వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరికీ ఈనెల 27వ తేదీన స్క్రీనింగ్ టెస్ట్ పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్షలో అర్హులైన అభ్యర్థులను మెరిట్ లిస్ట్ ప్రకారం ఉచిత డీఎస్సీ శిక్షణకు ఎంపిక చేస్తారని తెలిపారు.

దట్టంగా కమ్ముకున్న పొగమంచు

కమ్ముకున్న పొగ మంచు.. బయటికి రాని ప్రజలు..

ప్రజాశక్తి -పూతలపట్టు : దట్టంగా కమ్ముకున్న పొగ మంచుతో.. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఆదివారం ఉదయం 8 గంటల వరకు పూతలపట్టు మండలంలో దట్టమైన పొగ మంచు కమ్ముకోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ప్రస్తుతం విష జ్వరాలు అధికంగా ప్రబలు తుండడంతో మంచుకు భయపడి ఇళ్లకే పరిమితమయ్యారు. జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న వాహనాలు సైతం కనిపించకపోవడంతో భారీ వాహనాలు రహదారి పక్కనే ఆపాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకవైపు పొగ మంచు మరోవైపు అధిక వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

ఎస్వీయూలో పిజి కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి - ఎస్‌వియూ క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎంఎ, ఎం.కామ్, ఎం.ఎస్సీ, కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు డిఓఎ డైరెక్టర్ ఆచార్య వుకా రమేష్ బాబు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఎస్వీయూలోని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్ల కార్యాలయంలో ఈనెల 14, 15 తేదీల్లో ఎక్కడా సీటు పొందని, పిజి సెట్ 2024లో ర్యాంకు పొందిన విద్యార్థులు తమ ఒరిజనల్ సర్టిఫికేట్లతో హాజరై సీటు పొందవచ్చని కోరారు. మరిన్ని వివరాలకు డీఓఎ డైరెక్టర్ ఆచార్య రమేష్ బాబును (0877-2248589) సంప్రదించాలని తెలిపారు.

పిహెచ్‌డి అభ్యర్థులు డిఓఎ కార్యాలయంలో రిపోర్టు చేయండి

ఎస్వీయూ పరిధిలో ఆర్‌సెట్ 2023 -24 ద్వారా పిహెచ్‌డి సీట్లు పొందిన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికేట్లతో డీఓఎ కార్యాలయంలో ఈనెల 14 నుంచి 19వ తేదీ వరకు లోపు రిపోర్టు చేయాలని డిఓఎ డైరెక్టర్ ఆచార్య వుకా రమేష్ బాబు తెలిపారు.

ధ్వజావరోహణంతో

ముగిసిన శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి- తిరుమల: : తిరుమల శ్రీవారి ఆలయంలో తొమ్మిది రోజుల పాటు జరిగిన శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్స వాలు శనివారం రాత్రి ధ్వజావ రోహణంతో ముగిశాయి. రాత్రి 7 గంటలకు బంగారు తిరు చ్చి ఉత్సవం జరిగింది. అనంతరం ధ్వజావరోహణంతో శ్రీ వారి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్ స్వామి, టీటీడీ ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సివిఎస్‌ఓ శ్రీధర్, అధికారులు పాల్గొన్నారు.

16న గ్రహణ మొర్రి పిల్లలకు ఉచిత చికిత్స

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:

ఈ నెల 16వ తేదీన చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలోని డిఇసి సెంటర్‌లో తిరుపతి బర్డ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో చిత్తూరులో పెదాల చీలిక , గ్రహణ మొర్రి కలిగిన పిల్లలకు ఉచిత చికిత్స నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ప్రభావతి దేవి తెలిపారు. పెదాల చీలిక గ్రహణ మొర్రి పిల్లలను గుర్తించి ఉచిత ఆపరేషన్ చేస్తామని తెలిపారు. బుధవారం డిఈఐసి సెంటర్, ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరుకు హాజరై ఉచిత సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగిసిన దసరా సెలవులు

• బస్సుల రద్దీ • ప్రయాణికుల ఇక్కట్లు

ప్రజాశక్తి -సోమల: దసరా సెలవులు ఆదివారం ముగియడంతో సోమవారం నుండి ఉద్యోగాలకు వెళ్లేవారు స్వగ్రామాల నుండి పనిచేసే ప్రదేశాలకు బయలు దేరి వెళు తుండడంతో సోమలలో బస్సులు ప్రయాణికులతో రద్దీగా కనిపించాయి. సోమల తిరుపతి, సోమల పుంగనూరు, సోమల కలికిరి మార్గాలలోని అన్ని ఆర్టీసీ బస్సులు, ఆటోలు ప్రయాణికులతో కిక్కిరిశాయి. పిల్లలు, వృద్ధులు, మహిళలు రద్దీగా ఉన్న బస్సులు ఎక్కలేక ఇబ్బందులు పడ్డారు.

బంగారుపాళ్యం: దసరా సెలవుల్లో స్వగ్రామాలకు వచ్చిన స్థానికులు సెలవులు ముగియ డంతో బెంగళూరు కు తిరుగు ప్రయాణంలో బస్సులు దొరక్క ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు .దసరా సెలవులను ముందస్తు ఏర్పాట్లు ఆర్టిసి వారు ఏర్పాటు చేయకపోగా ప్రయాణికులు బెంగళూరు ప్రయాణానికి గంటలు గంటలు బస్టాండ్ వేచి ఉన్నారు.

బంగారుపాళ్యంలో బస్సు కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

కళాతరంగిణి చిన్నారులకు జబర్దస్త్ ఆర్టిస్టుల ప్రశంసలు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: స్థానిక కళాతరంగిణి చిన్నారులు జబర్దస్త్ ఆర్టిస్టులు ప్రశంసలు అందుకున్నారు. పుట్టపర్తి పట్టణంలోని శిల్పారామంలో దసరా సందర్భంగా రాష్ట్ర పర్యాటకశాఖ ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో బైరెడ్డిపల్లె కళాతరంగిణి సంస్థ చిన్నారులు లహరి , రమ్య, భానుశ్రీ ,భరత్ ,మధుశ్రీ ,చిత్ర ,పావని ,చరిత ,చరణ్ తదితరులు పాల్గొని ఉత్తమ కళాప్రతిభను ప్రదర్శించారు. శాస్త్రీయ, జానపద నృత్యాలు ప్రదర్శించిన చిన్నారులను ముఖ్య అతిథులుగా హాజరైన జబర్దస్త్ ఆర్టిస్టులు బుల్లెట్ భాస్కర్, నరేష్ , జితేందర్ అభినందించారు . ముఖ్య అతిథి మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి చిన్నారులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందిం చారు. చిన్నారులకు ఉత్తమ శిక్షణ అందించిన కళాతరంగిణి సంస్థ వ్యవ స్థాపకులు రాజేష్ బాబును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శిల్పారామం పరిపాలనాధికారి రమేష్ రెడ్డి , సీనియర్ ఆర్టిస్టులు కళాకిరణ్ , మస్తాన్, కల్పన తదితరులు పాల్గొన్నారు.

కళాతరంగిణి చిన్నారులను అభినందిస్తున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

నూతన బస్సు సర్వీసులు ప్రారంభం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ప్రజల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చిత్తూరు జిల్లాకు 70 నూతన బస్సులు మంజూరు చేసిందని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ అన్నారు. చిత్తూరు 2 డిపోలో చిత్తూరు టు వేలూరుకు రెండు నూతన బస్సులను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా సౌకర్యార్థం నూతన బస్సులను మంజూరు చేసిందన్నారు. ఇందులో భాగంగా చిత్తూరు నుండి వేలూరుకి వెళ్లడానికి బస్సులు తక్కువగా ఉండడంతో ప్రజలు సమస్యను తన దష్టికి తీసుకుని రాగా తక్షణం స్పందించి రెండు హైయర్ బస్సులను ఏర్పాటు చేశారని తెలి పారు. భవిష్యత్తులో మరి న్ని నూతన టెక్నాలజీతో కూడిన ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వం ప్రజలకు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు వసంత్ కుమార్, ఆర్టిసి ఆర్ఎంఒ జగదీష్ , డిపో మేనేజర్ రూపశ్రీ ఇతర ఆర్టీసి అధికారులు, సిబ్బంది ఉమ్మడి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్

మురుగు నీరు ఇలా..అరికట్టేది ఎలా..?

• రహదారిపైనే మురుగునీరు • పట్టించుకోని పంచాయతీ అధికారులు

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు:

ప్రజలు నివసిస్తున్న చోటే మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. స్థానికులు నివాసాల నుండి స్నానపు నీరు రోడ్డుపైకి వస్తున్నాయి. ప్రజలు ఇంకుడు గుంతలు తవ్వుకున్నారు. అయితే భూగర్భంలో ఈ నీళ్లు ఇంకకుండా రోడ్డుపైకి వస్తున్నాయి. గతంలో స్థానికులు సంబంధిత అధికారులకు, పంచాయతీ వారికి తెలిపారు. వారు వచ్చి పరిశీలించి డ్రైనేజీలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అయినా ఎలాంటి కాలువల నిర్మాణం చేపట్టలేదు. దీంతె గంగాధర నెల్లూరు నియోజకవర్గ తూగుండ్రం గ్రామంలో మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. గతంలో యజమానులు వారివారికి అనుకూలమైన స్థలాలలో ఇంకుడు గుంతలు తవ్వుకున్నారు. అయినా మురుగు నీరు భూమిలో ఇంకా ఇంకలేదు. దీంతో ఆ గుంతలు ఉప్పొంగి రోడ్డు పైకి వస్తున్నాయి. గృహ యజమానులు పాత్రలు, దుస్తులు ఉతికే నీరు సైతం రోడ్డుపైకి వదిలేస్తున్నారు. దీంతో చుట్టుపక్కల వున్న గృహాల వారికి, పాదచారులకు నడిచేందుకు సమస్యగా మారింది. ఈ మురుగు నీరు కారణంగా దుర్వాసన వస్తోంది. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి మురుగు నీరు రోడ్డుపై పారకుండా డ్రైనేజీలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యను పరిష్కరిస్తాం..

వీధిలో ప్రవహిస్తున్న మురుగునీరు

మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తున్న మాట వాస్తవమే సంబంధిత విషయం అధికారులకు తెలిపి వారి ఆదేశాల మేరకు సమస్యను పరిష్కరిస్తాం.. స్థానికులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం..

- మురళి, కార్యదర్శి, తూగుండ్రం పంచాయతీ, గంగాధర నెల్లూరు.

ఇది నిరంతర సమస్య

మా గ్రామంలో సంవత్సరాల కొద్దీ ఈ సమస్య వుంది. నిరంతర సమస్యగా మారింది.. ఈ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి పలు మార్లు తీసుకెళ్లాము.. అయినా ఎలాంటి పరిష్కారం లేదు.. డ్రైనేజీ సమస్యను ఎంత త్వరగా పరిష్కరిస్తే అంత మంచిది.. స్థానికులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలి..వర్షాకాలం కారణంగా అపరిశుభ్రంగా మారి వ్యాధులు వ్యాపించే ప్రమాదం వుంది.

- శేఖర్ రెడ్డి, తూగుండ్రం గ్రామం.

పూర్వ విద్యార్థుల నగదు సాయం

పాఠశాల అభివృద్ధికి నగదు సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి -సోమల: సోమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1981- 82 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధి కోసం తమ వంతు సాయంగా 60 వేల రూపాయల నగదును ప్రధాన ఉపాధ్యాయులు హరినాథ్ కు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ తాము చదివిన పాఠశాలలో అభివృద్ధి పనులు చేసి పాఠశాలకు తోడ్పాటు అందించాలన్న సదుద్దేశంతో విరాళం అందించామని తెలిపారు. ప్రధానోపా ధ్యాయులు మాట్లాడు తూ పూర్వ విద్యార్థులు అందించిన విరాళాన్ని ఆర్వో ప్లాంట్ భద్రత కోసం ఏర్పాటు చేసే గేట్లకు వినియోగించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్ర మంలో షకీల్, ఉమాశంకర, జనార్ధన్, రమాపతి, జిసికె ప్రసాద్, భాస్కర రామారావు, రాజేశ్వర నాయుడు, కోదండన్న పాల్గొన్నారు.

ఘనంగా కృపాలక్ష్మి జన్మదిన వేడుకలు

కృపాలక్ష్మిని సన్మానిస్తున్న వైసిపి నాయకులు

కార్వేటినగరం: గంగాధర నెల్లూరు నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జి కళత్తూరు కృపాలక్ష్మి జన్మదిన వేడుకలను శనివారం నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీలో పలు కేడర్‌కు చెందిన నాయకులు అత్యధికంగా తరలి వెళ్లి పుత్తూరు తమ స్వగృహం వద్ద నిర్వహించిన జన్మదిన వేడుకలను హాజరై పుష్పగుచ్ఛాలు, శాలువలు కప్పి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపి అభిమానం చాటుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గం ఇన్‌ఛార్జి కృపాలక్ష్మి మాట్లాడుతూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞలు తెలిపారు. వైసిపి ప్రతి కార్యకర్త రానున్న ఎన్నికల్లో పార్టీ విజయం కోసం అహర్నిశలు కృషి చేసి కూటమి ప్రభుత్వానికి ఓటమి భయాన్ని చవి చూపించాల్సిన అవసరం ఉందని పిలుపు నిచ్చారు. టీడీపీ నాయకులు చేపడుతున్న దాడులకు భయపడకుండా ముందుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అండగా తాను ఉంటానని భ రోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లతబాలాజీ, మండల కన్వీనర్ ధనంజయవర్మ, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, శేషాద్రి, కుప్పారెడ్డి, గోపి, పట్టాభిరెడ్డి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, ఆకుల గోపి, ఆరు మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు పలువురు పాల్గొన్నారు.

కృపాలక్ష్మి పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎస్ఆర్ పురం : మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణ స్వామి కుమార్తె, గంగాధర నెల్లూరు నియోజక వర్గ ఆదర్శ మహిళ ఎమ్మెల్యే అభ్యర్థి కళత్తూరు కృపాలక్ష్మికి రాబోయే ఎన్నికల్లో వైసిపికి విజయం కట్ట బెట్టి పూర్వ వైభవం తీసుకొద్దామని కొత్తపల్లి యువత నాయకుడు పొన్న సాము అన్నారు. శనివారం కృపాలక్ష్మి పుట్టిన రోజు వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. పిల్లలకు, పెద్దలకు యువత మహిళలు, గ్రామస్తులకు కేకులు, మిఠాయిలు పంచి పెట్టారు. ఈ సందర్భంగా సాము మాట్లాడుతూ..జగన్ మోహన్ రెడ్డి పాలనలో అందరికీ ప్రభుత్వ పథకాలు అందాయని దీని మరోసారి గుర్తుంచుకోవాలని కృపాలక్ష్మికి అండగా నిలవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ధరణి, శేషాద్రి, ఆబురు, యాకూబ్, కానిక రాజు , నీలమ్మ, మరియమ్మ, దొరవేలు, ధనుంజయ, భరత్, ధనుష్, సురేష్, మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరిగా ముత్యాలమ్మ

ప్రజాశక్తి - బంగారుపాలెం: బంగారుపాళ్యం మండల కేంద్రంలోని ముత్యాలమ్మ ఆలయంలో ముత్యాలమ్మ రాజరాజేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. మండలంలోని బ్రహ్మానంద ఆశ్రమంలో దేవీ నవరాత్రులను పురస్కరించుకొని చిన్న పిల్లలను దేవతల వేషధారణతో పూజలు నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు.

రతన్ టాటాకు ఘన నివాళులు

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: ప్రముఖ పారిశ్రామిక వేత్త రతన్‌టాటాకు ఏపీటీఎఫ్ నాయకులు ఆదివారం ఘన నివాళులు అర్పించారు. ఏపీటిఎఫ్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశ్రామికవేత్త, మానవతావాది రతన్ టాటాకు జిల్లా ఎపిటిఎఫ్ నాయకులు ఘన నివాళులు అర్పించారు. భారత పారిశ్రామిక రంగానికి వెన్నుముకగా నిలిచి, మానవతా మూర్తీభవించిన టాటా మరణం దేశానికి తీరని లోటు అని ఏపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గోపినాథ్ ఆయన సేవలను కొనియాడారు. ఆయన స్ఫూర్తితో యువత ముందుకెళ్లాలని ప్రధాన కార్యదర్శి ముక్తార్ అహ్మద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర కౌన్సిలర్ శివశంకర్, నాయకులు అమర్నాథ్ రెడ్డి, జగదీష్, మధు, నవీన్, వేణు, కృష్ణ, త్యాగరాజ్‌నాయుడు, మూర్తి, వాసు, లక్ష్మీపతి, విజయకుమార్, యుగంధర్ పాల్గొన్నారు.

సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోవాలి

ఏఐటీయూసీ నాయకులు డిమాండ్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: జిల్లా విద్యాశాఖాధికారిని నిలదీసినందుకు ఏఐటీయూసీ నాయకులపై విధించిన సస్పెన్షన్ ఉత్తర్వును ఉపసంహరించుకోవాలని ఆ సంఘం నాయకులు కోరారు. ఏఐటీయూసీ అనుబంధ సంఘాల నాయకులు ఆదివారం సమావేశమై ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై తీసుకోవాల్సిన నిర్ణయాలపై చర్చించారు. ఆ సంఘం నాయకులతో కె రమాదేవి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్.నాగరాజు మాట్లాడుతూ ఎలాంటి కారణం లేకుండా ఉపాధ్యాయుల సమస్య పరిష్కారం కోసం, వారి హక్కుల కోసం , వారి సంక్షేమం కోసం నిత్యస్ఫూర్తి జిల్లా విద్యాధికారి డిఇఒని నిలదీసినందుకు కక్ష పెట్టుకుని గంటా మోహన్‌పై సస్పెన్షన్ విధించడంపై ఏఐటీయూసీ అనుబంధ సంఘాల నాయకులు తీవ్రంగా ఖండిస్తున్నారని. గంటా మోహన్‌పై సస్పెన్షన్ ఉత్తర్వును ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో ఏఐటీయూసీ అనుబంధ సంఘాలతో దశల వారీగా దీక్షకు కార్యాచరణ ముందు ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఘనంగా కలశ ఆరాధన పూజ

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండల పరిధిలోని వింజం పంచాయతీ కృష్ణంపల్లెలో పోలు వంశస్తులచే నిర్మితమైన అంకాల పరమేశ్వరి సమేత బాల గురునాథ స్వామి దేవస్థానం మహాకుంభాభిషేక వేడుకల్లో భాగంగా అమ్మవారికి మహాగణపతి పూజ, యాజమాన్య సంకల్పం, కలశారాధనలు కార్యక్రమాన్ని ఆలయ పురోహితులు అనంతశయనం అయ్యంగార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పూజల్లో పాల్గొన్న పోలు వంశస్తుల భక్తులు, వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన ప్రజలకు అన్నదాన నిర్వహించారు.

16 నుండి 'పల్లె పండుగ' వారోత్సవాలు

ప్రజాశక్తి -సదుం : గ్రామీణాభివృద్ధి లక్ష్యంగా ఈ నెల 16వ తేదీ నుండి 20 వ తేదీ వరకు నిర్వహించనున్న పల్లె పండుగ గ్రామ పంచాయతీ వారోత్సవాల సందర్భంగా సదుం ఎంపీడీవో రాజశేఖర్ బాబు సదుం గ్రామ పంచాయతీలలో కొత్త పనులకు భూమి పూజలు నిర్వహిస్తున్నామని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దుర్ల వివరాలను విలేకరులకు వివరించారు. సదుంలో ఉన్న 18 గ్రామ పంచాయతీలకు, 13 గ్రామ పంచాయతీలకు కొత్త పనులు మంజూరు మంజూరైనట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, ఉపాధి హామీ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొనాలని ఆయన పత్రికా ప్రకటనలో తెలిపారు.

'కుప్పం ప్రజలకు కృతజ్ఞతలు'

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : వరద బాధితులకు తమ వంతు సహాయ సహకారాలు అందించిన కుప్పం ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు సాయి మాత సేవ ట్రస్ట్ వ్యవస్థాపకులు జగదీష్ బాబు హర్షం వ్యక్తం చేశారు. వరద బాధితుల సహాయార్థం కుప్పం ప్రజలు తమ ట్రస్టుకు అందించిన నిత్యావసర వస్తువులను, దుస్తులను, దుప్పట్లు విజయవాడకు నాడు బాధితులకు అందించామన్నారు. సహాయాన్ని అందుకున్న బాధితులు కుప్పం ప్రజలకు, సాయి మాత సేవ ట్రస్ట్ అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలపడం ఆనందంగా వుందన్నారు.

వాన నీరు కాదు.. మురుగు నీరే..!

రోడ్డుపైనే ప్రవహిస్తున్న మురుగునీరు

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమల పంచాయతీ దళితవాడ సమీపంలో రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తుండడంతో ప్రజలు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సోమల - నంజంపేట ప్రధాన మార్గంలోని దళితవాడ వద్ద రోడ్డుపై దళితవాడ గ్రామానికి చెందిన మురుగునీరు ప్రవహిస్తోంది.. దీంతో వాహన చోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సమీప ప్రాంత ప్రజలు దుర్గంధంతో పాటు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. పంచాయతీ, రోడ్ల భవనాల శాఖ వారు తక్షణం స్పందించి ఈ ప్రాంతంలో కల్వర్టును నిర్మించి మురుగునీరు సజావుగా పారేందుకు తగు చర్యలు తీసుకోవాలని దళితవాడ వాసులు కోరుతున్నారు. మురుగు నీటి కాలవలను శుభ్రం చేయక పోవడం వల్ల మురుగు నీరు నిల్చి పోయి రోడ్డుపై ప్రవహి స్తోం దని శాశ్వత ప్రాతిపదికన కల్వర్టును నిర్మిస్తే మురుగునీరు సక్రమంగా పారే అవకాశం వుంది. వెంటనే మురుగునీటి కాలువ నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సిపిఎం మహాసభలను జయప్రదం చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- పలమనేరు: నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న ప్రజా పోరాటాలు చేస్తున్న సిపిఎం14వ జిల్లా మహాసభలు ఈనెల 26, 27వ తేదీల్లో చిత్తూరులో నిర్వహించనున్నారని వీటిని జయప్రదం చేయాలని కోరుతూ సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు ఆధ్వర్యంలో పలమనేరులో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా విభజన అయినప్పటి నుంచి జిల్లాలో అనేక రకాల పోరాటాలు చేసిన సిపిఎం మహాసభలకు ప్రజలందరూ విరివిగా సహాయ సహకారాలు అందించి జయప్రదానికి కృషి చేయాలని పిలుపు నిచ్చారు. జిల్లాలో అనేక రకాల సమస్యలపై సిపిఎం పోరాటం చేస్తోందన్నారు. పలమనేరు ప్రాంతంలో దళితులపై దాడులు జరిగినప్పుడు అండగా నిలబడిందన్నారు. రైతాంగ సమస్యల పరిష్కార కోసం పోరాటం నడిపిందని, అదే కాకుండా స్కీమ్ వర్కర్లను రాజకీయ తొలగిస్తుంటే వారి కండగా నిలబడి పోరాటం చేసిందన్నారు. పలమనేరు, చిత్తూరు నగరి మున్సిపాల్టీలో ఉన్న ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు చేశామన్నారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం పరిష్కారానికి, , పవర్ లూం కార్మికుల సమస్యలు పరిష్కారానికి, దళితులపై జరిగిన దాడులు నిరసిస్తూ అన్ని వర్గాల ప్రజల సమస్యలపై నిరంతరం జిల్లాలో సిపిఎం పోరాటం చేస్తోందన్నారు. ఈ మహాసభల జయప్రదానికి ప్రజలు, శ్రేయోభిలాషులు విరాళాలు ఇచ్చి సభలను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ఓబుల్ రాజు, గిరిధర్ గుప్తా, నాయకులు ఈశ్వరయ్య ధనలక్ష్మి, సంజయ్, అంజి పాల్గొన్నారు.

లారీ టైర్లలో మంటలు

- రూ.3 లక్షల ఆస్తి నష్టం
- మంటలు అదుపు చేసిన అగ్నిమాపక శాఖ అధికారులు

టైర్లలో మంటలు వ్యాపించి ప్రమాదానికి గురైన లారీ

ప్రజాశక్తి-పుంగనూరు: తినే పదార్థాలు తీసుకెళుతున్న లారీ టైర్లలో హఠాత్తుగా మంటలు చెలరేగాయి. వెంటనే అగ్ని మాపక అధికారులకు సమాచారం అందించడంతో సకాలంలో స్పందించిన వారు మంటలు అదుపు చేశారు. దీంతో లారీకి పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో మూడు లక్షల రూపాయలు మేర ఆస్తి నష్టం సంభవించింది. అగ్నిమాపక శాఖ అధికారి సుబ్బరాజు కథనం మేరకు..మదనపల్లె నుండి తమిళనాడు గుడియాతంకు తినే పదార్థాలు లారీలో తీసుకెళుతుండగా టైర్లలో హఠాత్తుగా మంటలు చెలరేగాయి. వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. పుంగనూరు అగ్నిమాపక కేంద్ర పరిధిలో బైపాస్ రోడ్డు భగత్ సింగ్ కాలనీ సమీపంలో లారీలో అగ్ని ప్రమాదం జరిగిందని తమకు సమాచారం అందింది. వెంటనే సిబ్బందితో ప్రమాద స్థలానికి వెళ్లి ఏపీ 39 టీ 9736 నెంబరు గల లారీ వెనుక వైపు టైరు పగిలి రన్నింగ్‌లో రాపిడి కారణంగా అగ్ని ప్రమాదం సంభవించినట్లు గుర్తించి మంటలను పూర్తిగా అదుపు చేశామని తెలిపారు. వాహనం వెనుక భాగం ఎడమవైపు నాలుగు టైర్లు, లారీ బాడీ ఎడమ వైపు పాక్షికంగా అగ్ని ప్రమాదానికి గురైంది. వెంటనే అగ్నిమాపక శాఖ మంటలను అదుపు చేసింది. దీంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో నాలుగు టైర్లు, లారీ వెనుక వైపు భాగం కొంతమేర కాలిపోవడంతో ఈ ప్రమాదంలో సుమారు రూ.మూడు లక్షలు ఆస్తి నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

క్రికెట్‌తో మానసికోల్లాసం: ఎమ్మెల్యే

విజేతలకు బహుమతులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే థామస్

ప్రజాశక్తి-ఎస్ ఆర్‌పురం : క్రీడలు మానసికోల్లాసాన్ని ఇస్తుందని, మంచి ఆరోగ్యకరమైన జీవితాన్ని అందిస్తుందని గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు. గత వారం రోజులుగా చిన్న తయ్యూరు గ్రామంలో ఆర్గనైజర్ సురేష్ ఆధ్వర్యంలో జరిగిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలుగా నిలిచిన పిళ్లారి కుప్పం టీంకు ఆదివారం బహుమతులు పంపిణీ చేశారు. ఈ టోర్నమెంట్‌లో18 క్రికెట్ టీమ్‌లు పోటీలో పాల్గొన్నాయని, ప్రథమ స్థానంలో విజేతలు గా పిళ్లారి కుప్పం క్రీడాకారుల టీం నిలవడంతో మొదటి బహుమతి పొంది క్రీడాకారులు 40 వేల రూపాయలు పారితోషికం అందించారు. ద్వితీయ స్థానంలో గంగాధర నెల్లూరు మండలానికి చెందిన బుక్కపట్నం గ్రామానికి చెందిన క్రికెట్ క్రీడాకారులకు రన్నర్ గా నిలిచి 20వేల రూపాయలు పారితోషికం అందించారు. క్రీడాకారులను అందర్నీ అభినందించారు ఈ కార్యక్రమంలో క్రీడాకారులతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, జిల్లా టిడిపి నాయకుడు రాజశేఖర్ నాయుడు, కొత్తపల్లి మిట్ట టిడిపి నాయకుడు సూరి రెడ్డి, హరిమానకంగం గుడి ఉత్సవ కమిటీ సభ్యులు హిమాచలపతి రెడ్డి, జలంధర్ నాయుడు, హేమాద్రి యాదవ్ చొక్కమడుగు కుమార్, లోకనాథం, బాలు, స్థానికులు క్రికెట్ అభిమానులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : బిసిఎన్ విద్యా సంస్థలలో భాగమైన కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థులను కళాశాల ఛైర్ పర్సన్ శాంతా నాగరాజు, వైస్ ఛైర్మన్ సాగర్ రాజ్, ప్రిన్సిపల్ సుధారాణి అభినందించారు. శనివారం ఎస్వీ విశ్వవిద్యాలయం విడుదల చేసిన డిగ్రీ నాలుగవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలలో కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరచడం హర్షించదగ్గ విషయం అన్నారు. కళాశాల ప్రారంభం నుండి ప్రతి సంవత్సరం విద్యార్థులు ప్రతి పరీక్షలోనూ అత్యుత్తమ ప్రతిభను కనబరుచుతూ కళాశాలకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావడం సంప్రదాయంగా మారిందన్నారు. దీన్ని కొనసాగిస్తూ ప్రస్తుత సంవత్సరం సైతం విద్యార్థులు తమ పరీక్షలలో ఉత్తమ ప్రతిభను ప్రదర్శించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థుల విజయానికి కారకులైన కళాశాల అధ్యాపకులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు.

'నిరక్షరాస్యులను విద్యావంతులు చేయడమే లక్ష్యం'

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : మండలం లోని పెద్దతయ్యూరు, దళితవాడలో నిరక్షరాస్యులైన 63 మంది మహిళలకు విద్యావంతులను చేసేందుకు రిడ్స్ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా రాత్రి పాఠశాల నిర్వహిస్తున్నామని సంస్థ ఛైర్మన్ తియో స్టీఫెన్ అన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ తియో స్టీఫెన్ మాట్లాడుతూ మాట్లాడుతూ విద్యకు నోచుకోని మహిళలను గుర్తించి వారందరినీ విద్యావంతులుగా చేయడమే ప్రధాన లక్ష్యంగా రీడ్స్ సేవా సంస్థ పనిచేస్తోందని ఇందులో భాగంగా పెద్దతయ్యరు దళితవాడలో కటుకు పేదరికంలో ఉన్న మహిళలను గుర్తించి , సంఘ సంస్కర్త స్వర్ణకుమారి ఆధ్వర్యంలో రాత్రి పాఠశాల నిర్వహిస్తున్నామని, ఈ రాత్రి పాఠశాల ద్వారా మహిళలు విప్లవత్మకమైన మార్పులు తీసుకువచ్చి విద్యావంతులయ్యారని, అన్నారు. సమాజంలో జరిగే విషయాలను తెలుసుకోవడానికి చదువు ఉపయోగపడుతుందన్నారు. వీరందరికీ రీడ్స్ సేవా సంస్థ ద్వారా బోధన ఉపకరణాలు, నిత్యవసర వస్తువులను అందించారు. రీడ్స్ సేవా సంస్థ చేసే అభివృద్ధి కార్యక్రమాలను గ్రామ సర్పంచ్ వరదమ్మ, గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమానికి రీట్స్ సంస్థ డైరెక్టర్ కృష్ణమూర్తి, స్టీఫెన్, నాని, పాస్టర్ తులసి మణి, కుప్పయ్య, రవి పాల్గొన్నారు.

మద్యం షాపులకు 158 దరఖాస్తులు: సిఐ

ప్రజాశక్తి -పుంగనూరు : పుంగనూరు ప్రొఫెషనల్ ఎక్సైజ్ స్టేషన్ సర్కిల్ పరిధిలో ప్రైవేటు మద్యం దుకాణాలు 14 గాను 158 దరఖాస్తులందాయని సేబ్ సీఐ సి కె సురేష్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్కిల్ పరిధిలో ఉన్న మున్సిపాలిటీ అర్బన్, చౌడేపల్లి, సోమల,పెద్దపంజాణి మండలంలో గుర్తించిన మద్యం షాపులు 14అని తెలిపారు. మద్యం షాపులు ఏర్పాటుకు సంబంధించి సోమవారం ఉదయం చిత్తూరు పట్టణంలోని చిత్తూరు కాణిపాకం రోడ్డు సంతపేట వద్ద గల ఆర్‌ఆర్ గార్డెన్స్ లో లాటరీ తీయబడుతుందని చెప్పారు. కావున దరఖాస్తుదారులందరూ 7 గంటల కల్లా పైన పేర్కొన్న వేదిక వద్దకు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. ఒక్క పుంగనూరు సర్కిల్లో మాత్రమే రాష్ట్ర ప్రభుత్వానికి మద్యం దరఖాస్తుదారుల నుంచి 32 లక్షల రూపాయలు ఖజానాకు జమ అయ్యిందని తెలిపారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -కార్వేటినగరం: తహశీల్దారు కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న వీఆర్‌ఏల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని నగరి డివిజన్ వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు ఆర్ లోకనాథం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నగరి డివిజన్ పరిధిలో వీఆర్‌ఏలు అధ్యక్ష, ఉపాధ్యక్షులు, కమిటీ సభ్యుల నూతన కమిటీని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా నాయకులు కోడండన్, లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎంపికైన లోకనాథం మాట్లాడుతూ విద్యార్హత ఆధారంగా వీఆర్‌ఏలకు ఉద్యోగోన్నతి కల్పించాలని పనికి తగ్గ వేతాలను చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు టీ వెంకటేశులు, ప్రధాన కార్యదర్శి బాబు, కోశాధికారి హరి, ఉప కోశాధికారి టీ జగన్నాధం, టీ పాండురంగం, పలువురు వీఆర్ఎలు పాల్గొన్నారు.

'16 లోపు క్రాకర్స్ లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలి'

ప్రజాశక్తి -పుంగనూరు: దీపావళి పర్వదినానికి సీజనల్ క్రాకర్స్ లైసెన్స్ రెన్యువల్ కు ఈనెల 16న ఆఖరి అని అగ్నిమాపక శాఖ అధికారి సుబ్బరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పుంగనూరు అగ్నిమాపక కేంద్ర పరిధిలో పుంగునూరు అర్బన్ , చౌడేపల్లి, సోమల, కందూరు, పెద్ద ఉప్పరపల్లి, సదుము, కల్లూరు,రొంపిచర్ల 2024 సంవత్సరంలో గాను టెంపరరీ క్రాకర్స్ హెూల్డర్స్ దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులతోపాటు వారి వారి పోలీస్ స్టేషన్ పరిధిలో టపాకాయలు పై ఏదైనా కేసు నమోదయి ఉంటే పోలీసు వారి క్లియరెన్స్ సర్టిఫికెట్ సమర్పించాలన్నారు. కావున ప్రతి ఒక్క క్రాకర్స్ హెూల్డర్స్ 16 వ తేదీ లోగా సమర్పించిన యడల వారి దరఖాస్తులను ఆపై స్వీకరించేది లేదని తెలిపారు.

క్రైం న్యూస్

వాహనాలు ఢీ - ఒకరికి గాయాలు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: ఈచర్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన బంగారుపాలెం మండలం మొగిలి ఘాట్‌లో శనివారం చోటు చేసుకుంది. సిఐ శ్రీనివాసులు కథనం మేరకు పలమనేరు నుంచి చిత్తూరుకు వెళుతున్న ఈచర్ నూతనంగా నిర్మించిన స్పీడ్ బ్రేకర్ వద్ద నిదానంగా వెళుతుండగా బెంగళూరు నుండి తిరుమలకు వెళుతున్న కారు వేగంగా వచ్చి ఈచర్ వెనక భాగంలో ఢీకొంది. దీంతో కారులో మల్లికార్జున రెడ్డి, అతని భార్య అశ్విని వారి పిల్లలు ప్రవళ్లిక, ప్రత్యజ్ఞ ప్రయాణిస్తుండగా ప్రవళ్లికకు తీవ్ర గాయాలయ్యాయి. బంగారుపాలెం ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేపట్టి మెరుగైన చికిత్స కోసం ప్రవళ్లికను వేలూరు నిర్వి ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కోడి పందెం రాయుళ్లపై పోలీసుల దాడి

పది మంది అరెస్ట్

ప్రజాశక్తి - రామకుప్పం: కుప్పం రూరల్ సర్కిల్ పరిధిలో జరుగుతున్న కోడి పందెం రాయుళ్లపై పోలీసులు మెరుపుదాడి చేసి పది మందిని అరెస్ట్ చేసిన సంఘటన ఆదివారం రామకుప్పం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... రామకుప్పం మండల పరిధిలోని చెల్దిగానిపల్లి పొలాలవద్ద కోడిపందేలు ఆడుతున్న సమాచారం అండటం తో కుప్పం రూరల్ సిఐ మల్లేష్ యాదవ్ నేతృత్వంలో, రాళ్లబుదుగూరు ఎస్సై నరేష్ , గుడిపల్లి ఎస్సై శ్రీనివాసులు , వీకోట ఎస్సై బాబు తమ సిబ్బంది కలిసి దాడి చేశారు. ఈ సందర్భంగా పది మంది నిందితులను అరెస్ట్ చేసి వారి నుండి 17,650 రూపాయల నగదు, రెండు కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొన్న ద్విచక్ర వాహనం

ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి -సోమల: ఆగి వున్న వాహనాన్ని ద్విచక్ర వాహనం ఢీ కొన్న ప్రమాదంలో ముగ్గురుకి గాయాలైన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. మండల కేంద్రమైన సోమల సమీపంలోని బూరగమాను వద్ద పుంగనూరు నుండి తిరుపతికి వెళుతున్న టాటా ఏస్ వాహనం టైరు పంచరు కావడంతో రోడ్డు పక్కగా నిలిపి టైరు తీసివేస్తుండగా పుంగనూరు నుండి సదుం వెళుతున్న ఇద్దరు ద్విచక్ర వాహనదారులు ఆగి ఉన్న టాటా ఏస్ వాహనాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఒకరికి కాలు విరిగిపోయింది. మరో ఇద్దరికి స్వల్ప గాయాలు అయ్యాయి. గాయపడ్డ ముగ్గురిని ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివశంకర్ తెలిపారు.ఈ సంఘటనలో ద్విచక్ర వాహనదారులకు, టాటా ఏస్ వాహనానికి టైరు తీస్తున్న ఇద్దరికీ గాయాలైనట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- వికోట. : మండల పరిధిలోని నడిపేపల్లి సమీపంలో ద్విచక్ర వాహనం, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా మరి కొంత మందికి చిన్నపాటి గాయాలయ్యాయి. స్థానికులు కథనం మేరకు..గోనమాకులపల్లికి చెందిన కన్నప్ప కుమారుడు శోభన్ బాబు (20) ఆదివారం సాయంత్రం ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ప్రమాదవశాత్తు ఢీకున్నాయి. ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న. గోనుమాకులపల్లికి చెందిన కన్నప్ప కుమారుడు శ్రీనివాసులు (50), శోభన్ బాబు తీవ్రంగా గాయపడగా మరి కొంతమంది స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం తెలుసుకున్న వీకోట 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని, తీవ్రంగా గాయపడిన వారిని వికోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులకు సమాచారం అందింది.

ఐఆర్‌ఎం కళాశాల విద్యార్థినుల ప్రతిభ



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులు

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : ఐఆర్‌ఎం కళాశాల డిగ్రీ విద్యార్థినులు నాల్గవ సెమిస్టర్ పరీక్షలలో ఉత్తమ ప్రతిభను కనబరిచారని ఆ కళాశాల అధ్యక్షులు బి ఎం దయానిధి తెలిపారు. ఎస్వీ విశ్వ విద్యాలయం విడుదల చేసిన పరీక్ష ఫలితాల్లో తమ కళాశాల బికాం విభాగంలో తులసి 9.19, బిబిఏ విభాగంలో హీనాకౌసర్ 8.97, బిఎస్‌సి విభాగంలో త్రిష 8.23 మార్కులు సాధించి కళాశాలకు ఉత్తమ పేరు ప్రతిష్టలు తీసుకు వచ్చారని ఆ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీదేవి తెలిపారు.

ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు డిఎస్‌సి ఉచిత శిక్షణ

గంగాధర నెల్లూరు: టెట్‌లోఅర్హత సాధించిన ఎస్సీ , ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ ద్వారా ఉచిత శిక్షణ ఇప్పించనున్నట్లు ఏ ఎస్ డబ్ల్యూఓ షకీల పేర్కొన్నారు. గంగాధర నెల్లూరు మండల పరిధిలోని అర్హులైన ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు దరఖాస్తులు జ్ఞానభూమి పోర్టల్ ద్వారా అప్లై చేసుకోవాలని సూచించారు. ఈనెల 11 నుంచి 21 లోపు దరఖాస్తులు పంపాలన్నారు.

పుంగనూరు: రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ ఉత్తర్వుల మేరకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డిఎస్సీ ద్వారా ఎస్జీటీ స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సహాయ సాంఘిక సంక్షేమ అధికారి ఎన్ నరసింహులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణతో పాటు, ఉచిత భోజన వసతి సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ శిక్షణ కార్యక్రమం 3 నెలలపాటు ఇస్తారన్నారు. ఈ డీఎస్సీ శిక్షణ తీసుకొనుటకు టెట్ అర్హత కలిగిన అభ్యర్థులు, వార్షిక ఆదాయం రెండున్నర లక్షలు ఉండాలన్నారు. అర్హత కలిగిన ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు ఈనెల 11 నుండి 21 వరకు జ్ఞానభూమి వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరికీ ఈనెల 27వ తేదీన స్క్రీనింగ్ టెస్ట్ పరీక్ష నిర్వహిస్తారని చెప్పారు. అర్హులైన అభ్యర్థులు మెరిట్ లిస్టు ప్రకారం ఉచిత డీఎస్సీ శిక్షణకు ఎంపిక చేస్తారన్నారు. మరిన్ని వివరాల కోసం జ్ఞానభూమి వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి: తహశీల్దారు

ప్రజాశక్తి -బంగారు పాళ్యం: గ్రామస్థాయి అధికారులు గ్రామాల్లో అందుబాటులో ఉండాలని తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ ఆదివారం పేర్కొన్నారు. సోమవారం నుండి తుఫాన్ ప్రభావం వల్ల గ్రామాల్లో ఉండాలని, వాగులు, వంకలు, పశువుల మేతకు వెళ్లే వారికి ముందస్తు సమాచారం అందివ్వాలని ప్రాణ నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై వుందని దీన్ని గ్రామ స్థాయిలో విస్తృతంగా తెలపాలన్నారు. గ్రామంలో వీఆర్వో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పర్యవేక్షణ ఉండాలని విపత్తులు జరిగినప్పుడు ఉన్నత అధికారులకు సమాచారం అందించాలన్నారు.

టి గడ్డుర్లో దసరా మహోత్సవాలు

విజయమ్మ , మునికృష్ణ ఆధ్వర్యంలో..

మల్లెపూల గరిగె ఊరేగింపు

పురవీధుల్లో భక్తులకు దర్శనమిస్తున్న సల్లాపురి గంగమ్మ

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలంలోని టి గడ్డురులో వెలిసిన శ్రీ సల్లాపురమ్మ దేవస్థానంలో గ్రామస్తులు దసరా మహోత్సవాలలో భాగంగా అక్టోబర్ 4 నుండి 12 వ తేదీ వరకు వివిధ రూపాలలో అమ్మవారి అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా శనివారం రాత్రి 11 గంటలకు అమ్మవారి ఊరేగింపు కోసం కర్ణాటక అనంతరం బాలాపూర్ గ్రామానికి చెందిన అజిత్ కుమార్ మల్లె పులా గరిగే తలపై అలంకరించి మొట్టమొదట ఎం విజయమ్మ మునికృష్ణ దంపతులు మల్లెపూల గరిగెకు ముందస్తు పూజలు నిర్వహించి గ్రామ ప్రజలలో ఊరేగింపు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటి వద్ద పూజలు నిర్వహించారు. దీంతో పాటు బ్యాండ్ మేళాలతో, చెక్కభజనల మధ్య గ్రామంలోని ప్రజలు ఆనందంగా చిన్న పెద్ద తేడా లేకుండా చిందులు వేశారు. ఈ కార్యక్రమంలో గడ్డురు గ్రామంలో నివసిస్తున్న ఎం విజయమ్మ, కృష్ణప్ప బెంగుళూరు ట్రస్ట్ యజమానుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుడి ధర్మకర్తలు, స్థానిక సర్పంచ్ దేవేందర్ రెడ్డి, పార్టీలకు అతీతంగా గ్రామ పెద్దలు, మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాదాలకు పూజలు చేస్తున్న దృశ్యం

ఊరేగింపుగా వెలుతున్న దృశ్యం